# పరీక్ష

[కథానిక]

శ్రీ నెల్లూరి కేశవస్వామి

౧

"రంగా! ......రంగా!"

"..................."

"ఒరేయి రంగా! పిలుస్తూంటే నిన్ను కాదూ?"

"చిత్తం బాబూ! వస్తున్నాను. చిన్నబ్బాయిని ఆడిస్తూ......"

"దొంగవెధవా! నాపిలుపుకంటే చిన్నబ్బాయి ఆ ఎక్కువైందేం?"

"అదిగాను బాబూ! ......"

"నోరు మూయి రాస్కెల్! ఇంకా మాట్లాడుతున్నావూ?...నేను చెప్పిన పనేంచేశావు?"

"చిత్తం, చేశాను."

"అన్నీ సిద్ధంచేశావా?"

"చిత్తం."

"ఊఁ...రేపు తెల్లవారుఝామున్నే ప్రయాణం మరి."

"ప్రయాణ మంటున్నా రెక్కడికండోయ్?" వంటింట్లోంచి మా ఆవిడకంఠం.

"ఓయ్! నీ కింకా తెలీదూ? ... రంగడు చెప్పలా?"

"అంతటి అదృష్టంకూడానా? ప్రభువుల రాచకార్యాల్లోకి స్త్రీలు జోక్యం......"

"ఛప్! ఆగు. అదే వద్దన్నాను. మాటి మాటికీ స్త్రీలూ స్త్రీలూ అంటూ యాడవకపోతే ... ఎవరు కొట్టారు?.........ఇంతకూ నీతో చెప్పేదేమిటంటే, రేపు ప్రొద్దున్నే ప్రయాణం."



"అదే ఎక్కడికని?"

"ఎక్కడికైతే ఏం, వెళుతున్నాను దౌరా, ఇన్స్పెక్టరువెంట"

"మరీయెప్పుడు తిరిగి రావటం?"

"ఏమో, చెప్పలేను......అన్నీ సిద్ధంచేయాలి."

"నే నేమిటి చేయటం? అన్నీ మీ హనుమంత భటుడే చేశాడుగా. ఇక మిగిలింది రెండు బుడ్లు. సెలవైతే......"

"ఏమిటే?"

"ఓస్, అల్లా కళ్ళెఱ్ఱజేస్తా రెందుకూ? నే నే మన్నాననీ? అవునులెండి, వున్నసంగతి చెబితే ఎవతికేనా వులుకే."

"ఏం, నే నంత తాగుబోతు ననుకున్నావా?"

"అన్యాయం, నే ననకోవట మేమిటి, మీకు మాత్రం తెలీదూ?"

"అయితే, అది లేందీ నే నొక్కపూటకూడా వుండలే ననేనా నీ అభిప్రాయం?"

"ఆసంగతి మీ చిత్తా న్నడగండి."

"సరే, చూద్దువుగాని, ఆ మాటపైనే నిలువు. నీకూడా తెలిసివస్తుంది నే నెంత పంతంగల మనిషినో."

"ఆహా! ఏం పంతం! రేపుసాయంత్రంవరకే ఇవన్నీనీ."

"రేపు సాయంత్రమే కాదు, ఇల్లాంటి వింకా పదిసాయంత్రాలు వచ్చినా నామనసు చలింపదు తెలుసా?"

"అనటాని కేం లెండి. ఎన్నైనా అనవచ్చు. సమయంవస్తే పట్టుమని పదినిమిషాలుకూడా ఆగ లేరు."

"సరే, రేపే చూస్తావుగా."

"సరే కానీయండి."

తెల్లవారి మూడింటికి లేద్దా మనుకుంటే నాలు గింటికి తెలివివచ్చింది. నాప్రయాణసన్నాహ మంతా సిద్ధమయిం దని చెప్పాడు రంగడు. తొందరగా లేచి కాల్యకృత్యాలు తీర్చుకువచ్చాను. సీత వంటింట్లో వుంది. తల దువ్వుకుంటూండేసరికి జవాను వచ్చాడు.

"అయ్యగారూ! సాబ్ పిలుస్తున్నారు."

"ఇదిగో వచ్చె, నువు నడుస్తూండు" అని వాడిని పంపించి వంటింటికి మళ్లాను.

"సీతా!"

"ఓయ్!" వంటింట్లోంచే.

"అయిందా? రానా?"

"అంతా సిద్ధం. మడికట్టుకోండి."

"అబ్బ! ఇప్పుడు మడేమిటి"గొణుక్కున్నాను.

"ఏమిటీ?" గర్జన వినపడ్డది.

"అబ్బే! మరేం లేదు. తిరుమణిపెట్టి ఎక్కడుం దంటూన్నాను."

*  *  *  *

భోజనమై బట్ట లేసుకునేసరికి అయిదు కావచ్చింది. ఈలోగా జవాను మరి రెండుసార్లు వచ్చాడు. ఈ ఆచారాలు అంత తొందరగా వదుల్తాయా? అంతా తెమల్చుకుని కర్ర చేత బుచ్చుకునేసరికి అయిదు దాటిపోయింది. ఇక అడుగువేద్దా మనుకుంటూంటే వెనకనుండి సీత "ఏమండోయ్! నా మాట విని ఒక్క బుడ్డీ అయినా తీసుకొనివెళ్లండి."

"ఏం, నీకు పిల్లలాటయిందా?" ఆమాటల్లో ఎంత గర్వం వుంది!

"ఇప్పుడు మీ రట్లానే మాట్లాడ్తారు. ఆనక మీకే తెలిసివస్తుంది."

"తెలిస్తే తెలిసింది, నువ్వూరుకుందూ!"

"నాకేం, నే నూరుకుంటాను. తర్వాత నన్నే మీ అనొద్దని ఇప్పుడే చెబుతూన్నాను."

"సరే లే" తిరిగిచూడకుండా వెళ్లాను.

## ౨

మేం వెళ్లేది ఓ చిన్న పల్లెటూరు. అక్కడికి సేరుగా రోడ్డు లేదు. పన్నెండు మైళ్ల వరకే మోటారు ప్రయాణం. తర్వాత అడ్డుతోవ. బండ్లల్లో వెళ్లాలి.

ఏడు కొట్టేసరికి మోటారు దిగాం. మా దురదృష్టాన అక్కడ బండ్లు సిద్ధంగా లేవు. వాటికోసరం ప్రక్కపల్లెల్లోకి మనుషుల్ని పంపించాలసివచ్చింది.

నేను చెట్లకింద పచారుచేస్తున్నాను. మా ఇనస్పెక్టరు ఫ్లాస్కూ, డబుల్‌రొట్టే, వెన్నా తీశాడు. సావకాశంగా కూర్చుని ఆరగిస్తున్నాడు. ... ...

"మిస్టర్ రామాంజం!"

ఆ పిలుపుతో దగ్గరికెళ్లక తప్పిందికాదు. ఎంతో దయతో నాకూ్కడా offer చేశాడు (ఇవ్వబోయాడు). కాని బాబోయ్! సాహేబులదగ్గిర తీసుకోటమే! తడబడే నాలుకతో అన్నాను — "క్షమించాలి. ఇప్పుడు తీసుకోలేను. ప్రొద్దున్నే భోజనమైంది."

"పోనీ, వుత్త కాఫీ అయినా పుచ్చుకోండి"

"నో, థాంక్స్."

"ఊం. ఏ మాచారాలండీ, ఇవ్వీ? అందులో చదువుకున్నవారుకూడాను!"

నావళ్లు భగ్గుమంది. ఆ చిరునవ్వులో ఎంత హేళన, ఎంత ఈర్ష్య వుంది! కాని ఏంచేయను? కోపం దిగమింగి నీళ్లునమిలి వూరుకున్నాను

పోయిన మనుషులు తిరిగివచ్చారు. ఎక్కడా జాడి చిక్కలేదట. ఇంకోవూరికి వెళ్లమని మళ్లీ పంపించాడు ఇనస్పెక్టరు. నాకు చెడ్డకోపం వచ్చింది. కాని ఎవరిమీద ఆ కోపం తీర్చుకోవాలో తెలీక గమ్మని

పూరుకున్నాను. ఇనస్పెక్టరు ఫలహారమయింది. సిగరెట్ పీలుస్తూ బిఛాణాపైన వొరిగాడు. నేనుకూడా ఇంకో పక్కకు కూర్చున్నాను.

పొద్దెక్కుతోంది. ఎనిమిది, తొమ్మిది, పది. కాని ఇంతవరకూ ఎవరిజాడా లేదు. నాహృదయంలో ఆందోళన ఎక్కువైంది. నా ప్రక్కనే హాయిగా నిద్రిస్తూన్న ఇనస్పెక్టరును చూస్తే ఎక్కడలేని కోపమూ నన్నావరిస్తూవుంది. ఏమీ పాలుపోక లేచి మళ్లీ పచారు చేయటం మొదలెట్టాను. ఆలోచనాపరంపర శరవేగంతో సాగుతోంది. వెనక జరిగినవీ, ముందు జరగబోయేవీ ఒకొక్కటే జ్ఞాపకమొస్తోంది. సీతమాటలు జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా మనసు చివుక్కుమంటోంది. వాటిలో నిజం లేదని నేనను. పైగా నేనే వోడిపోతానేమోనన్న భయంకూడా పట్టుకుంది. ఇల్లా జరుగుతుందని తెలిసివుంటే అసలు అంత పంతంగా మాట్లాడివుండను. సాయంత్రంవేళకు తప్పక ఇల్లు చేరుతాననే ధైర్యంవల్లే అంత పట్టుదలగా మాట్లాడాను. తీరా ఇప్పుడు చూస్తే ఆ ఆశ ఏమీ లేనట్టు గోచరిస్తోంది.

పదకొండు కావచ్చింది. కాని ఇంకా బండీ లేదూ, పోయిన మనుషులూ లేరు. విసుగెత్తుతోంది. అంతా చీకాగ్గా వుంది. ఇనస్పెక్టరు మెల్లిగా లేచి కూర్చుని, దస్తర్‌ఖాన్ పరిపించాడు. ప్లేట్లతో అన్నీ సిద్ధమయ్యాయి. ఇక అక్కడ వుండటం బావుండదని వెళ్లబోతూంటే —

“మీ రింకా భోజనం చేయలేదుకదూ?” చిరునవ్వుతో అన్నాడు ఇనస్పెక్టరు.

నామనసు కలవరం చెందింది. “లేదు. అక్కర్లేదు” అంటూ వెళ్లిపోయాను. వాడి ఆ విషపునవ్వు జ్ఞాపకము చేసుకున్నప్పుడల్లా ఏదో బాధ, చెప్పరాని బాధ కలుగుతోంది. నాపైనే కాదు, పవిత్రమైన నావైష్ణవమతంపైనే విసరే వాడి మాటల్లో ఎంత ఈర్ష్య వుంది. నేను చదువుకున్నవాడినట! చదువుకుంటేమాత్రం మతసంప్రదాయాలు వదలుకోవాలా? ‘ఆచారాలు ఆచారాలు’అని హేళనచేస్తాడు-లేకుంటే వీడిలా నేనుకూడా సహం క్రిష్టియన్నయిపోవాలనా వీడి వుద్దేశం?..... అప్పుడే ముప్పై, నలభై అడుగులు నడిచాను. ఒక్కసారి నా ఆలోచనలకి బ్రేకు తగిలింది. దూరాన **Eastern horizon** దగ్గిర (అల్లంత దూరంలో) ఓబండి వస్తూన్నట్టనిపించింది. నాహృదయం సంతోషంతో గంతులేయసాగింది. అదే సంతోషంలో మరి కొన్ని అడుగులు ముందుకు వేశాను. నా అదృష్టం ఫలించింది. వస్తూన్నది బండే. వెంటవున్న వాడు మారహీమేననికూడా పోల్చుకోగలిగాను. వెంటనే వెనక్కు తిరిగివచ్చి ఆ సంతోషవార్త ఇనస్పెక్టరుకు తెలియజేశాను. అతనుమాత్రం యథావిధిగానే వున్నాడు. ఏమార్పూ కలగలేదు. భోజనం పూర్తి కాలేదు.

బండి వచ్చి నిలిచింది. రహీమును రెండుమాటలూ, బండివాణ్ణి రెండుచీవాట్లూ పెట్టి సామాను సర్దించటం మొదలెట్టాను. అంతా అయినతర్వాత తన **bed** (పరుపు) బండ్లో పెట్టబోతోంటే ఇనస్పెక్టరు వారించాడు. “వుండండి, నా బెడ్డుని అప్పుడే వేయకండి. నేను కాస్త విశ్రాంతి తీసుకోవాలి.”

దాంతో నాకు వళ్లు మండుకొచ్చింది. ప్రొద్దున్నుంచీ తీసుకున్న విశ్రాంతి చాలదూ? “ఇక్కడేం విశ్రాంతండీ, లెండి, ఆవూరు చేరినతర్వాత అక్కడే తీసుకుందురుగాని. పైగా ఇక్కడ ఎండకూడా జాస్తీగానేవుంది” అన్నాను వేడుకుంటూ. కాని ఊహుఁ, నామాటెందుకు వింటాడు? మళ్లీ అన్నాను: “పోనీండి, మీరు బండిలో విశ్రాంతి తీసుకోండి, నేను వెనకాలే నడిచివస్తాను”. దీనికీ వప్పుకోకపోతే నే నింకేం చేయను? రహీమూ, బండివాడూ నన్ను **side** చేశారు (సమర్థించారు). కాని లాభం లేకపోయింది. మళ్లీ ప్రారంభించాను: “కాస్త నాపైనేనా దయతలచండి. ప్రొద్దున్నుంచీ అన్నం లేదాయె. ఇప్పుడావూరి కెళ్లి వంట చేసుకోవాలి. ఇప్పటికే ఎంతప్రొద్దు పోయిందో చూడండి.” దీనంగా వేడుకున్నాను. దీంతోమాత్రం కొంత కరిగాడు. ఆఘటం కదిలే ఆశ కలిగింది. అయితే ఏం? అతను భోజనం పూర్తిచేసి, సిగార్ పీల్చి బట్టలు వేసుకుని బండిలో కాలుపెట్టేసరికి పక్కా ఘంటయిందంటే నమ్మండి.

రెండుఘంటల్లో చేరుతామనుకున్న వూరు సరిగ్గా నాలుగ్గంటల్లో చేరాము. దీని క్కారణం

మే మనుకున్నదానికంటె ఆవూరు ఎక్కువదూరంలో వుండటమో, లేక ఎడ్ల ముసలితనమో, లేక నాదుర దృష్టమో చెప్పలేను. ఏదెట్లున్నా, త్రోవంతటా అందరికన్నా ఎక్కువ బాధపడ్డది నేను. ఆకలిబాధా, ఎండతీక్ష్ణంకన్నా మా యజమాని (boss) నోటినుండి అప్పుడప్పుడు వెడలే 'కరుణరసవాక్యాలు' నాహృదయాన్ని ఎక్కువ గాయపరిచాయి. కాని ఏం చేయను? అన్నీ భరించి వూరుకున్నాను.

ముసాఫిర్ బంగళాలో బసచేశాము. అప్పటికే ఆటు కావస్తోంది. వెంటనే ఆవూరి కరణానికీ, పటేలుకూ కబురంపించాము. నిమిషాల్లో దూకారు మహానుభావులు. కాని నాదురదృష్టం కాకపోతే మరేమిటి? "నే నిప్పుడు బొత్తిగా అలిసివున్నాను. రేపు రండి చూసుకుందాం" అని వాళ్లని పంపించేశాడు మా ఇనస్పెక్టరు. అప్పుడు నాస్థితి ఏలా వుందో కాస్త వూహించండి. నిజంగా కళ్లల్లో నీళ్లు తిరిగాయంటే నమ్మండి.

3

ఇకనైనా వంట ఎందు కారంభించలే దంటే, ఇంకావంటేమిటి, నాశ్రాద్ధం! వున్న ఆకలి ఎప్పుడో చచ్చి వూరుకుంది. ఇప్పు డసలు ఆకలికాదు అయేది. దప్పిక! ఈదప్పిక నీళ్లతో చల్లారదు. దానికో Special Significance (ప్రత్యేక వైలక్షణ్యం) వుంది. ఆపదార్థం దొరక్కపోతే నాదప్పి చల్లారదు. దప్పిక చల్లారకపోతే నేను జీవించటం అసంభవం. దీనివిషయమై మాఆవిడ ఇదివరకే Prophesy (జోస్యం) చేసింది. అయితే నేనప్పుడు ఆమాటను ఎందుకు తోసిపుచ్చా నంటే, ఇల్లా పరిణమిస్తుం దని తెలియకపోవటమే కారణం. దీనికి నన్ను నేను ఎంత తిట్టుకున్నా పాపంలేదు. కాని లాభం కూడా లేదు. దీనివల్ల ఏదేనా మార్గం కనిపిస్తుందా అంటే, సున్నా...మరి దప్పిక తీరటం ఎట్లా? అదే పెద్ద సమస్య. ఎండలో వుడికిపోయిన మెదడుని పీల్చిపిప్పిచేసేస్తోంది. కాని ఏమీ తోచటంలేదు. అట్లానే చేతుల్లో నెత్తిపట్టుకుని కూర్చున్నాను.

అంధకారంలో వెలుగులా ఒక్కసారి ఒక యోచన తట్టింది. వెంటనే కఱ్ఱ తీసుకుని బయలుదేరాను. అంతవరకూ ఒక్కసారైనా కన్నెత్తిచూడని వూరిని ఇప్పుడు బాగా పరిశీలిస్తూ వెళ్లుతూన్నాను. ఒక యాభై గజాలు నడిచేసరికి వూరిబజార్లోకి వచ్చాను సందెచీకట్లో దీపాలు ఒక్కొక్కటే వెలుగుతున్నాయి. కొన్ని అడుగులు వేసేసరికి తేలిపోయింది- నావేటలో నేనుంటే, నన్ను వేటాడేవారు చాలామంది వున్నారని. నన్నో వింతమృగంలా చూస్తున్నాయి ఇరుప్రక్కలనుంచీ కళ్లు. కొందరు మరీ అసహ్యంగా వేలెత్తి సూచిస్తున్నారు. వీటన్నిటినీ లెక్కించకుండా ముందుకు సాగుతూన్నాను. నాకళ్లు ఇరుప్రక్కలా బాగా కలయచూస్తున్నాయి. కాని అడుగడుక్కీ బెల్లపుకొట్లూ, బట్టలకొట్లేకాని—ఏదీ, నేనుకోరే పదార్థం దొరికే చోటేదీ? ఒకచోట బట్టలషాహుకారు లేచి సవినయంగా "దయచేయండి బాబూ! దయచేయండి." అంటున్నాడు. వాడిమొహం చూస్తే ఎంతకోప మొచ్చిందనుకున్నారు! కఱ్ఱ తీసుకొని చావమోదా లనిపించింది కాని సమయం కాదని వూరుకున్నాను.

ఇంతకూ నేను వెతికే కొట్టేదీ? బజా రయిపోవొచ్చిందే? అసలు ఈవూళ్లో ఆపదార్థం దొరకదేమో! అబ్బో, ఆ తలంపే భయంకరంగా వుంది. మనసు వప్పటంలా. పోనీ, ఇండ్లల్లో అమ్ముతారేమో? కాని, ఎట్లా వెతకటం? ఎవర్నడగను? నన్నో వైప్రాయిలా గౌరవిస్తూన్న వీళ్లకళ్లల్లో ఇంత నీచమైపోవడమే! ఛా...వూరు చాలా చిన్నదిగామాలు, అప్పుడే అన్నిండ్లూ వెనకబడ్డాయి. ఎదుటంతా అంధకారమే. నా ఆశలన్నీ అందులో లీనమైపోయాయి. ఇక దిక్కులేక వెనక్కు మళ్లాను. ఇంతలో ఒకప్రక్కన ఏదో గందరగోళం వినిపించింది. చూద్దునుగదా లైటు కూడా వుంది. ఏదో చెప్పరాని ఆశ నన్నక్కడికి లాక్కెళ్లింది. అదో కల్లుకొట్టు. గుడ్డిలో మెల్ల. దీంతో నే దప్పిక తీర్చుకుందామా అని మొదటివూహ. ఛా! చిన్నప్పు డెప్పుడో తప్ప మళ్లీ ముట్టనిదాన్ని ఇప్పుడు ఎట్లా సేవించను? అందులో, అదో, ఆ త్రాగుబోతులు సహితం నన్ను వింతగా చూస్తున్నారే, వాళ్లతో సమానం నే నెట్లా కాను?... మరి దప్పికో? ఇప్పటి

కేదో వోహాటి. ఈ తొంగుబోతులు చూస్తే ఏం? వీళ్లల్లో ఎప్పటికీ వుండకూర్చున్నానా? మరెవ్వరూ చూడక పోతే సరి......దాంతో నలుప్రక్కలా చూశాను. వెనక్కు తిరిగాను. బాబోయ్! పదిమంది—చిన్నలూ పెద్దలున్నూ—నా వెనకే వున్నారే! నన్ను వెంటాడే వస్తున్నారా? ముచ్చెమట్లు క్రమ్మాయి. ఇక అక్కడ ఒక్కక్షణం నిలవలేకపోయాను. వెంటనే తొందరగా బయలుదేరాను. నా వెనకవాళ్లు నవ్వుకుంటూన్నట్టనిపించింది. పల్లెవాళ్లు అంత మోటుగా ప్రవర్తించరంటారు గాని నాకుమాత్రం సంశయంగానే వుంది.

వెనక్కి తిరిగిచూడకుండా బస చేరుకున్నాను. కాని బంగళాగేటుదగ్గరి కొచ్చేసరికి నాహృదయం భోరుమంది. ముందూ శూన్యం, వెనకా శూన్యం. ఏం చేయను? అడుగులో అడుగు వేస్తూ వెళ్లి అరుగుపైన వుస్సూరుమంటూ చతికిలబడ్డాను. ఒకప్రక్క సాహేబుగారివంటలు సిద్ధమైపోతున్నాయి. "ఎక్కడి కెళ్లారండీ అయ్యగారూ? వంట చేసుకోరూ?" అంటూ వచ్చాడు రహీం.

మొహం త్రిప్పేసుకుని అన్నాను- "ఊహుఁ, చేసుకోను. ఫలహారం చేసివచ్చాను." — అబద్ధం.

"అయ్యో! ఫలహారంతో ఏమవుతుంది, వంట చేసుకోండి. నే నన్నీ సిద్ధంచేసిస్తాను "

మరీ చిరాకెత్తింది. "అబ్బ! వూరుకుందూ. నేను చేయను. అసలే తలనొప్పిగా వుందంటూంటే." ఆదెబ్బతో వాడు వెళ్లిపోయాడు. పోడూ మరీ? వాడనేది నా కొరకా, వాడి కొరకా? ఇంత తెలివి అప్పుడు లేకపోయిందంటే అది నాతప్పు కాదు. అప్పుడు నే నా జోరులో వున్నాను మరి.

తల నిజంగానే బాధిస్తోంది. క్షణక్షణానికీ మరీ ఎక్కువౌతోంది. కళ్లపైన పొరలు కమ్మినట్టుగా వున్నాయి. నాలుక పీక్కుపోతోంది. వీటన్నిటికీ మందేమిటో తెలుసు. కాని అది లభించటం అసంభవంగా తోస్తోంది. వుంది ఒక్కమార్గం. కాని అదెట్లా లభించటం? నేనే స్వయంగా వెళ్లనా? బాబోయ్! ఆదృశ్యం జ్ఞాపకం చేసుకుంటేనే వళ్లు ఝల్లుమంటోంది. మరెట్లా? ఇంకెవరినయినా పంపించి తెప్పించుకుంటే? భలే మంచియోచన! కాని ఈ వూళ్లో అంతటి ఆప్తులెవరున్నారూ? రహీమో? అబ్బో! వాడితోనే? ఇక వాడికళ్లల్లో నా గౌరవం ఏముంటుందీ?...మరి ఈదప్పికో?... ఊహుఁ, వాడినే బతిమాలాలి... కాని వాడిద్వారా మాయజమానికి తెలిసిపోతే? ... అదెట్లా జరుగుతుంది? రహీంచేతిలో ఓ రూపాయి పెడితే చాలదూ?...బావుంది. కాని వాడిని అడగటం ఎట్లా? ఏమీ పాలుపోవటం లేదు. టైము మించిపోతోంది. ఆఖరికి ధైర్యం చిక్కబట్టి "రహీం!" అన్నాను రుద్ధకంఠంతో. "ఇదో వచ్చె" అంటూ వస్తున్నాడు. ఒక్కసారి నాహృదయం దడదడా కొట్టుకోసాగింది. వాడిని పిలిచింది నేనే. రమ్మనే పిలిచాను. కాని వాడు రావటంమాత్రం ప్రాణసంకటంగా వుంది. ఎందుకో?

"ఏమి టయ్యగారూ?"

తడబడే నాలుకతో "ఇల్లా రా" అన్నాను. అక్కడ నారహస్యం ఎవరేనా వినిపోతారని కాదు--ధైర్యం చిక్కబట్టుకోటానికి కొస్త వ్యవధి దొరుకుతుందని.

కొంచెంసే పాగి ఎల్లాగో సాగించాను: "చూశావూ రహీం! నీతో నే నొకరహస్యం చెబుతాను. ఎవ్వరితోనూ చెప్పవుకదూ?"

"అబ్బే! నాసంగతి మీకు తెలీదండీ?"

"అంచాతే నీతో చెబుతూన్నాను. నాపరువు దీనిపైనే ఆధారపడివుంటుంది. తెలిసిందా? ఎవ్వరికీ తెలియకూడదు."

"అబ్బెబ్బే! ఎవ్వరికైనా తెలియనిస్తానండీ?"

"మరి నిన్ను బాగా సంతోష పెడ్తాను."

"అది మీరు వేరే చెప్పాలా అయ్యగారూ."

"నువు నా కోపని చేసిపెట్టాలి."

"సెలవియ్యండి"

ఇంకా మెల్లిగా—"చూడూ, నాకు కొస్త నిషా అలవాటుంది."

"అంటే?"

"నిషా అంటే తెలీదా? సారాయనుకో"

"నిజంగానా?" విస్తుపోయాడు.

"ఏదోలే, అలవాటయింది. మన చేతుల్లో ఏముందిగనక? ఇప్పుడు సంగతేమిటంటే, ఒక్క రోజు అది లేనిదీ వుండలేను. అప్పటినుంచీ దానికోసరమే తిప్పలు పడుతూన్నాను."

"ఈ వూళ్లో సారా యెక్కడ దొరుకుతుందండీ?"

"పోనీ, కల్లయినాసరే ఈ పూటకి"

"అదిమాత్రం?"

"అది నేను చూశాన్లే. ఈ వూరావలి ప్రక్కన వుంది కొట్టు."

"మరి పుచ్చుకోకపోయారా?"

"అక్కడెట్లా పుచ్చుకోను రహీం?...నువు కాస్త తెచ్చిపెడ్తే..."

"మరి వంట చేస్తున్నాను కదండీ?"

నిరాశ చెందాను.

"ఎంతలో కొస్తావుగనక?..."

"అబ్బో! సాబ్ నేను లేంది చూస్తే వళ్లు వల్చేస్తాడు...సరే, వుండండి, ఎవరేనా మనిషిని పంపిద్దాం."

సంతోషం పట్టలేకపోయాను. రూపా యిస్తూ "నా పేరుమాత్రం చెప్పొద్దుసుమా" అన్నాను.

"అబ్బే! నాకోసరమని తెప్పిస్తానుగా" అని వెళ్లాడు.

అప్పుడు రహీం నాకళ్లకి సాక్షాత్తు భగవత్స్వరూపంలా కనుపించాడు. వాడివిషయమై ఎన్నో ఆలోచనలు కలిగాయి. ఇంటికెళ్లింతర్వాత ఒక మంచి చొక్కా ఇవ్వాలి. ఇకమీదట ఇనాం పావలాకు బదులు అర్ధ రూపా యివ్వాలి....ఇంకా ఎన్నో...నిజంగా వాడి ఈ ఉపకారానికి బదులు ఇవ్వగలనా?... మాటిమాటికీ వంట చేసే రహీంవేపు కృతజ్ఞతా దృక్కులు ప్రసరింపజేస్తున్నాను. అల్లాగే రోడ్డువేపు ఆశా దృక్కులు. ఆరోడ్డున వచ్చేవాళ్లంతా మొదట నా ఆశీర్వచనాలకూ, తర్వాత నాశాపాలకూ గురి అవుతూన్నారు. కాని నిజప్రతిమమాత్రం తెరపైన ఎంతకూ ప్రత్యక్షంకాదు. విసుగెత్తిపోతోంది. ఆఖరికి బాటసారి అనుకున్నవాడే ఒకడు హఠాత్తుగా మాగేటువేపుకు వచ్చాడు. వాడి వుత్తచేతులు చూచేసరికి వళ్లు ఝల్లుమంది. కాని అసలు వాడు కాడేమోనన్న ధైర్యం కలిగింది. కాని కొద్దిసేపటికే రహీం వచ్చి, "అయిపోయిందటండీ" అనేసరికి అంతా తేలిపోయింది. అట్లానే నిశ్చేష్టుణ్ణయిపోయాను. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నోట మాట లేదు. కళ్లముందు భూమ్యాకాశాలు తిరగటం మొదలెట్టాయి. "ఇదిగోండి రూపాయి" అని రహీం అనేవరకూ తెలివిలేదు.

"రహీం! రూపాయి వుండనీ. ఎవరితోనూ ఈ సంగతి..."

"అబ్బే! మీ రేమీ చింతించకండి. నే నెవరితోనూ చెప్పను. కాని రూపాయి మాత్రం వొద్దు. మీపని చేయలేకపోయాననే నాకు విచారంగావుంది."

నాకు తెలియకుండానే నా చేతిలో రూపాయి వుండిపోయింది.

నెత్తినెప్పి మరీ జాస్తీఅయింది. నుదుకట్టుకున్నాను. నాలుక పీక్కుపోతోంది. ఇక ఎట్లానైనా ఆ రాత్రి గడపాలని—విధిలేక—నిశ్చయించుకున్నాను. నీళ్లతోనే దప్పిక తీర్చుకుందా మనుకున్నాను.

"రహీం! బావి ఎక్కడుంది?"

"అదో! అటు గోడప్రక్క నుందండీ?"

తడబడే కాళ్లతో పోతూన్నాను. చేదను వెతికితీసి, వడికే చేతుల్తో, బావిలోకి వేశాను. నూరు ఆలోచనలు నా మెదడును తినేస్తున్నాయి. ఈ రాత్రి ఇట్లానే గడపాల్సిందేనా? ... అబ్బ! ... అరే! ఇదేమిటి చేద అల్లా వెళ్లిపోతోంది. అరే! ... అయ్యో!... "రహీం!"

"ఏమండీ?" పరుగెత్తుకొచ్చాడు.

"రహీం! చేద బావిలో పడిపోయింది."

"పోనీండి, రేపు తీపిద్దాం. మీ రిట్లా రండి." నన్ను చేయి పట్టుకుని అరుగుదాకా తీసుకెళ్లి కూర్చో

బెట్టి వెళ్లి ఓ గ్లాసులో మంచినీళ్లు తెచ్చాడు. నాకంతా అయోమయంగా వుంది.

"ఇవి త్రాగండి."

"ఏమిటవి?"

"నీళ్లు."

"ఊహుఁ."

"అయ్యో! త్రాగండి, లేకుంటే ప్రాణాపాయం."

బదులు చెప్పకుండా చిన్న పిల్లవాడిలా తాగేశాను.

తర్వాత మెల్లిగా "ఒక పరాటా తేనా?"

"వద్దు"

"తెస్తాను."

"నన్ను చంపుకున్నట్టే."

మారు పలక్కుండా వెళ్లిపోయాడు. మళ్లీ అడగలేదు. నే నట్లానే అరుగుపైన వొరిగాను.

౪

ఎనిమిదిన్నర దాటిపోయింది. నే నింకా అదే స్థితిలో వున్నాను. మా ఇనస్పెక్టరు అప్పుడే గదియీవలి కొస్తున్నాడని తెలిసి లేచి కూర్చున్నాను. తలగుడ్డకూడా విప్పేశాను.

"భోజన మయిందా మిస్టర్ రామాంజం?"

"ఆఁ, అయింది." అప్రయత్నంగా నా నోటినుండి వెడలింది.

"తొందరగానే?"

"అవును, వంట కాగానే భోంచేశాను."ఒక అబద్ధాన్ని కప్పిపుచ్చటానికి ఇంకో అబద్ధం. నే నబద్ధ మాడుతున్నానని నాకే కాదు, అతనికూడా తెలుసు. ఆ విషయం అతని చిరునవ్వే చెబుతోంది. కాని, అనేవాడికీ వినేవాడికీ తెలిసిన అబద్ధాలు ఆడడం కూడా మానవసహజం. అయితే ఇప్పటి అబద్ధంవల్ల మాత్రం ఏమీ లాభం లేకపోగా పైగా ఒక కొత్త చిక్కు వచ్చిపడ్డది.

"అయితే కాస్త ఇల్లా రండి" అంటూ లోనికి దారితీశాడు ఇనస్పెక్టరు. దిమ్మ తిరిగింది. చేతులతో చేసుకున్నందుకు వగస్తూ లేచి చచ్చినట్టు వెనకాలే వెళ్లాను. లోపల టేబిలూ, కుర్చీలూ ఆఫీసులాగుంది. వెళ్లి ఓకుర్చీని అలంకరించాను. ఎదట ఒక ఫైలు వేస్తూ సరిచూడ మన్నాడు. నావళ్లు భగ్గుమంది. కోపం పట్టలేక,పండ్లు కొరుకుతూ అతనివేపు ఓరగా చూశాను. కాని నావేపే చిరునవ్వుతో చూస్తూవున్న అతని కళ్లు నాకళ్లతో ఏకమయ్యేసరికి నాగుండె ఆగిపోయింది. ముచ్చెమట్లు క్రమ్మాయి. మొహం వెలవెలబారింది. తల వంగిపోయింది. ఎందుకో?

ముప్పైమూడుకోట్ల దేవతలను ప్రార్థిస్తూన్నాను, ఈగండం తప్పించమని. ప్రక్కనే వున్న మంచంపైన పండుకుని తను పీలుస్తూన్న సిగార్ పొగలోంచి ఇనస్పెక్టరు నన్ను చూస్తున్నాడని తోచినప్పుడల్లా నేను నరకబాధపడుతున్నాను. ఏదో వొక సాకు చెప్పి వెళ్లిపోదా మనుకున్నాను. కాని, బాబోయ్! వాడి అడ్డుప్రశ్నలూ, వ్యంగ్యవాక్యాలూ జ్ఞాపకం చేసుకుంటే ఆబాధకంటే ఈబాధే మేలనిపించింది. ఏం సరిచేస్తున్నానో ఏమో నాకే తెలీటం లేదు. క్షణమొక యుగంలా గడుస్తోంది. షుమారు పదిహేనునిమిషాలు గడిచివుంటాయి. నాకుమాత్రం ఒకయుగంలా గోచరించింది.

రహీం వచ్చాడు. "సాబ్! అంతా సిద్ధమైంది."

"సరే"అంటూ లేచాడు ఇనస్పెక్టరు,చేతిలోని సిగార్ పారేస్తూ. "ఇక చాలించండి మిస్టర్ రామాంజం!" అన్నాడు.

'బ్రతుకు జీవుడా' అనుకుని సంతోషంతో ఫైలు ఒకవేపుకు త్రోసి లేచాను. పోబోతూంటే ఈమాట: "ఆ ఫైలుకూడా తీసుకెళ్లండి. మీరూములో సరిచూడండి." ఎంత కర్ణకఠోరంగా వుంది! కాని, ఏవిధంగానో ఈవల పడాలనుకుని ఫైలును చేతబట్టుకుని గదియీవలికి గంతేశాను. నారూములోకి రాగానే నాకోపమంతా ఆఫైలుపైన తీస్తూ దాన్ని నేలకు విసిరికొట్టాను. వెళ్లి మంచంపైన గుభాలున పడ్డాను.

తలబాధ ఇంకా తీవ్రమౌతోంది. కణతలు గడ్డపారపోట్లకి ఆగలేకుండా వున్నాయి. వళ్లంతా వేడెక్కినట్టుంది. బాధగా వుంది. తల కేదన్నా గుడ్డకట్టుకుందామనుకున్నా చేతుల్లో సత్తువ లేకుండా పోయింది. కళ్లమంటా, కాళ్ల తీపులూ మొదలైనాయి. జ్వరం వచ్చేలాగుంది. ఇట్లా వంటరిగా అడవిలాంటి ఈపల్లెటూళ్లో పడి చావటాని కేం కర్మం? ఇప్పుడు నాసీతే నాదగ్గిరుండివుంటే? అబ్బ! అంత అదృష్టంకూడానా?... ఏమిటేమిటో పిచ్చి ఆలోచనలు.

ఇంతలో ప్రక్కగదిలోంచి ఒక శబ్దం – నాకు చిరపరిచితమైన శబ్దం – నేను రోజూ వినే శబ్దం – వినిపించింది. దాంతో నాహృదయం ఒకసారి ఆగి మళ్లీ తీవ్రంగా కొట్టుకోసాగింది. జ్వరం గిరం క్షణంలో మటుమాయమయాయి. చంగున లేచాను. ఇనస్పెక్టరు గదికీ, నాగదికీ మధ్య ఒక మూసిన తలుపు వుంది. అక్కడి కెళ్లి సందుల్లోంచి చూడటం మొదలెట్టాను. అబ్బ! ఏందృశ్యం అది! టేబిలుపైన అన్ని ఆహార పదార్థాలూ వున్నాయి. కూరల గుమాయింపు నాసికా రంధ్రాల్లోంచి హృదయాన్ని తాకుతోంది. పరాటాలూ, కైమావుండలూ దొంతర్లతో వున్నాయి. వీటన్నిటికంటే ముఖ్యమైనవి రెండుబుడ్డీలు. ఒకదాని కార్కు ఇప్పుడిప్పుడే తీసివుంది. వాటిలేబిల్ పైని White horse (తెల్లగుఱ్ఱం)తోబాటు నాహృదయం కూడా గంతులేయసాగింది. వాటిప్రక్కనే రెండు సోడాకాయలున్నాయి. అప్పుడు రహీంపైన చెప్పరాని కోపం కలిగింది. నాపైన అంతదయ చూపాడే, సాబ్ దగ్గిర బుడ్డీలు వున్నాయని వొక్కమాటేనా చెప్పకూడదూ?

ఇనస్పెక్టరు కుర్చీలో కూర్చుని ఆనందంగా మెల్లిగా సేవిస్తున్నాడు. నిజంగా, అదృష్టమంటే సాహేబులదే అదృష్టం. నరకంలోకూడా స్వర్గభోగాలనుభవిస్తారు. ఆక్షణానికి "నేనుకూడా అంత అదృష్టవంతుణ్ణయి వుండివుంటే" అనుకుంటూ పేరాసా ప్రతిమనై అట్లానే చూస్తూ నిలిచిపోయాను...ఒకటీ, రెండూ, మూడూ — పెగ్గులపైన పెగ్గులు పడుతూన్నాయి. ఎంచాతో మొదట బుడ్డీలుచూసినప్పుడు సంతోషమే కలిగినా తర్వాతతర్వాత చెప్పరాని బాధ ననుభవించటం మొదలెట్టాను. గ్లాసులోపడే శబ్దం వినగానే నోట్లో నీళ్లూరుతూన్నాయి. కాని మరుక్షణం నాలుక ఎండిపోతోంది.

ఒక్కబుడ్డీ సగంకన్నా ఎక్కువే అయిపోయింది. ఇక త్రాగలేకపోయాడు ఇనస్పెక్టరు. తిరిగి కార్కు పెట్టేశాడు. బుడ్డీలను చేతబట్టుకుని లేచాడు. నాలో ఒక్కసారి చురుకుపుట్టింది. ఏం చేయను? ఈరాత్రి వృథా పోవాలిసిందేనా? వెళ్లి అడిగితే?... అమ్మమ్మో! భయం వేసింది...అరే! అప్పుడే పెట్టెలో పెట్టేస్తున్నాడే? ఇక ఆగకూడదు... వెంటనే పరుగెత్తాను. త్రోవలోనే మంచం వుంది. కోడు తాకి బోర్లగిలా మంచంపైన పడిపోయాను......... మరుక్షణం సహారాలాంటి ఎడారిలో వున్నాను. నా దప్పిక్కి హద్దులేదు. ఎటు చూసినా ఎడారే. నీళ్లజాడే లేదు......ఒక్కసారి నాముందుకో చెలమ వస్తుంది. తహతహలాడే హృదయంతో ముందుకు పోతుతాను. చేతులు రావు. నోరాడదు. ప్రాకటం మొదలెట్టాను ...ఒక్కసారి పల్టీ కొట్టాను...

...కళ్లు తెరిచాను. మంచంకింద పడివున్నాను. నే నెక్కడున్నదీ, ఏస్థితిలో వున్నదీ మరుక్షణం జ్ఞాపకమొచ్చింది. లేచి గడియారం చూసుకున్నాను. పదకొండే అయినా అర్ధరాత్రిలా తోచింది. నాదప్పిక మరీ బాధపెట్టసాగింది. ఇక ఆగలేకపోయాను. నీళ్లకోసరం బయలుదేరాను. అంతటా నిశ్శబ్దంగానూ, అంధకారంగానూ వుంది. వెళ్లి వరండాలో వెతకటం మొదలెట్టాను. కొంచెందూరంలోనేవున్న ఇనస్పెక్టరు మంచం తగిలి కొంచెం సొలిగాను. చేతులు మంచంపైన పడ్డాయి. వెంటనే ఓ తాళంచేతులగుత్తి ఘల్లుమంది. దాంతో ఒకయోచన నామెదడులో మాటుమ్రోగింది. ఇక మొండిధైర్యానికి పూనుకున్నాను. వెంటనే ఆతాళంచేతులగుత్తి తీసుకుని తిరిగివచ్చి కోటు జేబులోంచి టార్చి తీసికొని ఇనస్పెక్టరుగదిదగ్గిర కెళ్లాను. గది ఓరగా వేసివుంది. లోపలికి సునాయాసంగా వెళ్లగలిగాను. సరిగ్గా ఆ బుడ్డీలు వున్న పెట్టి వేపుకు నడిచాను. తాళం తీసి మూసేసరికి నాహృద

యంలో జయభేరి మ్రోగింది. అక్కడ రెండుసీసాలూ వున్నాయి. ఇదివరకటి సగంసీసా తీశాను. సోడా కాయా గ్లాసుకోసం వెతికాను. కాని అవి తొందరలో దొరకలా. ఊహుఁ, ఇక ఆస్టే ఆలస్యం చేయకూడదు. అట్టానే త్రాగేయాలి. సీసా ఎత్తాను. వెంటనే 'దొంగతనం' అన్న భయం నన్నావరించింది.... కాని ఇది దొంగతనం ఎట్లా అవుతుంది? నే నివితప్ప ఇంకేమీ ముట్టుకోలేదే?...అంతగా వస్తే నాపైన ఎవరికీ అనుమానం కలగదన్న మొండిధైర్యం కలిగింది. ఇక మనసు నిలకలేకపోయింది. సీసాను నోటికి తగిలించాను.... అంతే. ఇక ఎంత ప్రయత్నించినా సీసాను నోటినుంచి తీయలేకపోయాను...............దాంతో ఓ కొత్త ఆనందం, కొత్త వుద్రేకం కలిగింది. ఇక ఆలోచనలకి వ్యవధి ఇవ్వకుండా రెండోసీసామూతి విరగ్గొట్టేశాను. అదీ పావువరకు గుక్కతిప్పకుండా త్రాగేశాను. అక్కడికి నాదప్పిక చల్లారింది- సంపూర్తయాను....

...ఇక ఈప్రపంచానికీ నాకూ సంబంధం లేదు. అంతరిక్షాన ఎగురుతున్నాను. ఆకాశం నాకు బెత్తెడు దూరంలో వుంది. ఎగరాలి, గంతులేయాలి, అఱవాలి, కేకలూ బొబ్బలూ పెట్టాలి, నవ్వాలి, ఏడ్వాలి... ఇంకా ఎన్నో ఎన్నో వూహలు నన్ను రేపుతున్నాయి. కళ్లమంటా, కాళ్లతీపులూ, తలనొప్పి, జ్వరం, భయం అన్నీ మటుమాయ మయాయి. అంత సంతోషం, అంత అనందం మరెప్పుడూ అనుభవించలేదు...... చేతిలో సీసా వుంది. వెళ్తున్నాను. ఎక్కడికో?... ద్వారం దాటాను......తర్వాత?.........

...తర్వాత తెలివి వచ్చేసరికి వళ్లు మంటలు పెడ్తోంది. చేతులూ, కాళ్లూ కదల వీలులేకండా వున్నాయి. అతిప్రయత్నంమీద కళ్లు తెరవగలిగాను. చూద్దునుకదా నేను బంధింపబడివున్నాను. హంటర్లతో బాదుతూన్నట్టు బాధకలుగుతోంది. మొదట ఇదే నరకమేమో ననుకున్నాను. కాని కాదు. ఎదుట మా ఇనస్పెక్టరు--అదే చిరునవ్వుతో--ప్రత్యక్షమయాడు. కొరడాదెబ్బలకన్నా ఆచిరునవ్వు నన్నెక్కువ గాయపరుస్తోంది. వెంటనే కళ్లు మూసుకున్నాను. దెబ్బలు మానమని ఎటువంటి ప్రార్థనా చేయలేదు. కాసేపటికి మళ్లీ తెలివితప్పాను.

